# స్నేహ స్పర్శ

*- శారదా పూర్ణ శొంఠి*

మళ్ళీ ఇంకోసారి కిడాంబిని తలుచుకునే రోజు వచ్చింది. ప్రతీసారి కొత్తగా వస్తుంది. స్ఫూర్తి కలుగుతూ ఉంటుంది. ఈమధ్య ఈ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా గొంతు బొంగురు పోతోంది. మిగిల్చిన తరగని ఆస్తి కళ్ళ ముందుంది. ఎవరికి కావలసిందైనా ఇదే! తీపి గుర్తులు! కాకపోతే అవి మనుష్యులకు సంబంధించినవి కాదు. వారి పుట్టుకకి కారణాలవి కావచ్చు! అవే గోముగా ధైర్యం చెప్పగలవు. గిర్రున తిరిగి పోతున్నాయి సంవత్సరాలు.

ఆరోజు మిత్రుడు భావరాజు న్యూజెర్సి నుంచి పిలిచారు. వెళ్ళిపోయిన కిడాంబిని వెనక్కి తెస్తూ! భావరాజు పలకరింపు ఆయన విశాఖపట్టణం వెళ్ళడం, నాన్నగారు గోపాలశాస్త్రిగారిని కలవడం, వివరాలు చెప్పడం అన్నీ కళ్ళముందుకి తెచ్చి జీవితం మీద బాధ్యతని పెంచినట్టయింది. ఆలోచనలని చెదలు పట్టనివ్వని నిజమైన స్నేహాలు. ప్రతీదీ ఒక సరి క్రొత్త ప్రేరణ. భావరాజుగారితో సారస్వత సంబంధం చాలా చిక్కన! కలిసి నప్పుడల్లా ఒక ఉల్లాసం, ఉత్తేజం. కిడాంబి నాకిచ్చిన వైదేహి పరిచయం ఆకోవలోదే! ఎన్నెన్నో గంటలు సాగాయి సంభాషణలు! ఆ ఊసులన్నీ బాగా గుర్తున్నాయి. ఒకేసారి చూసాను. తను అపురూపం. తన కవితలు మరీని! అమెరికానుంచి కుదరలేదు కానీ నవంబరులో లిబియానుంచి మాట్లాడగలిగాను తనతో! ఆ ఎడారి దేశంలో హాయనిపించింది. అది తన ఉపజ్ఞ!

అమెరికాలో సీజన్సు కాలానికే కాదు, అనుభూతులకీ ఉంటాయి. కిడాంబిని వేసవి రోజుల్లో కలిసేను. ఎముకలు కొరికే మంచు రోజుల్లో కలిసేను. స్నో కుప్పలై కొండలైనప్పుడు ఇంకోసారి. ట్యూలిప్పులూ, డాఫొడిల్సు విరగ బూసేటప్పుడు మరోసారి! ప్రపంచం పండుగచేసుకునే క్రిస్మస్ వేడుకల్లో, హిందువులు జరుపుకునే గోడలమధ్య పండుగల్లో! ఆరాటాల తెలుగు సమావేశాల్లో, నృత్యసంగీత ఉత్తేజ సమయాల్లో! కిడాంబితో గడిపిన రోజులు చాలా విచిత్రం. పలకరింపులు చెరుకు పానకం! సవరింపులు తెగ పదును. అపరోక్షానుభూతి

పరోక్షంకన్నా బలం. టెలిఫోను సంభాషణలు మనుషుల మధ్య దూరాన్ని పూర్తిగా చెరిపేస్తాయి. ఆరేళ్ళ టేలిఫోను పరిచయం! "మీ విషయంలో అంతుపట్టనిదేదో ఉంది. తెలుసుకోవాలని వచ్చానన్నారు"వినయం నేర్పుతూ! మొదటిసారి కలిసేటప్పటికి పూర్వ జన్మ గడిచి తెల్లారినట్లయింది. నోబెలు బహుమానం తిరస్కరించిన తాత్వికుడు ఎగ్రాపొండు తత్వంలా! కామాలతో ముగిసే కవితలా!

ఈ ఏడాది నాన్నగారు గోపాలశాస్త్రిగారు తన ఎనభై ఆరవ ఏట విశాఖపట్నం ఆంధ్రాయువర్సిటీ నుంచి Environmental Engineering PHD పట్టా అందుకున్నారని తెలిస్తే ఎంత సంతోషించేవారో కిడాంబి! తరచు - ఆయన దీక్షకి అబ్బుర పడేవారు. వాడికీ వేడికీ ముచ్చటపడేవారు. నాన్నగారి సాధన, క్రమశిక్షణ తనకెప్పుడూ దోవ చూపిస్తాయని పదేపదే అనడం జ్ఞాపకం వస్తుంది. మనుష్య జన్మ ఆంతర్యం ఆతరం వాళ్ళకే బాగా తెలుసని కిడాంబి విశ్వాసం. వాళ్ళ జీవితాలే మనకి సంప్రదాయాలనేవారు. వెళ్ళిపోయిన కిడాంబిని వెనక్కి పిలిచి చెప్పాలని ఉంది! ఒకటే తబ్బిబ్బు!

అమెరికా తెలుగు వాళ్ళ జీవితాలు గాడిలో పడుతున్నాయనిపిస్తోంది. కాలం గడుస్తోంది. చూపు పాకాన పడుతోంది. ఎంతోమందివో ప్రయత్నాలు పరసీమలో తెలుగుతనం వేళ్ళూనడం. దానికి నిదర్శనం.

౨౦౦౧ వచ్చింది. మామూలుగా రాలేదు. కిడాంబి గారిని, హైదరాబాదు తెలుగు యునివర్సిటీ ఉపాధ్యక్షులు డా.గోపీగారిని మరింత దగ్గర చేసింది. గోపీగారు పరమ భావుకుడు. వర్షానికి తడిసిన నేల వాసనో, పచ్చ గడ్డి వాసనో ఇదీ అని చెప్పలేనిదేదో తోస్తుంది. ఆయనలో ఒక ఉద్రేకం ఉంది.

అమాయకత్వం తోడుగా, అమెరికాలో తెలుగు పిల్లల కోసం ప్రత్యేకమైన కోర్సులు ప్రవేశ పెట్టే ప్రయత్నం ప్రారంభం చేసింది ఈయనే! చాలామందికి ఆలోచనల్లో ఉండి ఉండచ్చు. చరిత్రలో ఒక కొత్త మలుపు అది. ఆ తర్వాతి వారంతా ఊపందుకున్నారు. గోపీ నార్త్ అమెరికా అంతర్జాతీయ నాట్య సదస్సుకి వచ్చారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు నాలుగేళ్ళ పదవినీ, సంగీతం, కూచిపూడి నాట్యం అభ్యున్నతి పథకాల సమన్వయ కర్త బాధ్యతనీ నాకిచ్చిన మీదట గోపీగారితో ఆరేడు రాష్ట్రాలు తిరిగాను. ఎందరివో పరిచయాలు, ఉపన్యాసాల పరంపర, పనుల ఒత్తిడికి కేలండరులో అంకెలు మారేవి. గడియారంలో తెల్లారేది. క్రిక్కిరిసిన కార్యక్రమాలు దృఢ విశ్వాసం పోటీపడి వెంట వచ్చేవి. భారతదేశం పెరిగే ప్రయత్నం చేస్తోంది. తెలుగు

యూనివర్శిటీవి పదహారేళ్ళ లేతరెక్కలు. అమెరికాతో సాంస్కృతిక సంబంధాల కోసం ప్రయత్నిస్తోంది. ఆశయం గొప్పది. ఐదేళ్ళ శ్రమ. చిన్నచిన్న సమావేశాలు. మొదట్లో ఫలితం పల్చన. ఎంతమందిని కలిస్తే పనికానూ! ఉడతా భక్తి ఆశని పెంచింది. కిడాంబి కొంత కారణం. ఎగసం త్రోసారాయన. "మూడు వారాల్లో అమెరికా ఇండియాల మధ్య సాంస్కృతిక వంతెన కడతారా"అనేవారు. కోరిక పంతం పుంజుకుంది. అవసరాన్ని మించి జీవశక్తి ఖర్చయింది. జనాన్నుంచి ఎగతాళి చప్పుళ్ళు వినిపించేవి అయినా పనులు ఉధృతంగా సాగేయి. అమెరికా వారి ఆర్తి, విద్యావేత్తల యత్నం సమాంతరంగా ముందుకెళ్ళాయి. వలస వచ్చిన వారికి కళ ఒక తెడ్డు! కావలసిన పునాదులు పడ్డాయి. తెలుగు ఇళ్ళు కట్టేవాళ్ళదే అదృష్టం. ఈ మధ్య అమెరికాలో చాలా రాష్ట్రాల్లో తెలుగు భవనాలు వెలుస్తున్నాయి. సంతోషించ దగ్గ విషయం.

ప్రయాణంలో ఆఖరి మజిలీ న్యూయార్కు. ౨౦౦౧ సెప్టెంబరు ౭న బయలుదేరాం. మూడురోజులపాటు సమావేశాల ఉక్కిరిబిక్కిరి. కాలాన్ని ఎంత సాగతీయ వచ్చో అంతా సాగగొట్టాం. చెప్పొద్దూ గర్వంగా ఉండేది. లోతెరగడమే కారణం. మొదటి ఘట్టం ఓ కొలిక్కి వచ్చింది. ఆశ పెరిగింది. పథకాల సంఖ్య పెరిగింది. చేరవలసిన గమ్యం ఎక్కువ దూరం లేదనిపించేది. బండి గాడిలో పడింది. మా ముగ్గురికీ ఓపిక అవసరం వెయ్యింతలైంది. అన్ని సమావేశాల్లో వాడుక భాష గురించి ప్రశ్నలు గుప్పించారు. కళలు నేర్పడంలో వస్తున్న సంప్రదాయపు మార్పుల మీద మరిన్ని వాదనలు, అభిప్రాయ బేధాలు హాయిగా వ్యక్తమయ్యాయి. మారుతున్న విలువల మీద పెరుగుతున్న అభద్రతా భావం పైకి తేలింది. నిరాశా వాదం మాత్రం ఏకోశానా లేదు. కిడాంబి చూపు అన్ని విషయాల్లోనూ చాలా తీక్షణం. అన్నిటినీ లక్ష్యం వైపు తిప్పేవారు.. కిడాంబిగారి శ్రీమతి ప్రభరఘునాథ్ సంస్కార పరణితికి తార్కాణం, మాటలకందని సుఖం, ప్రసన్నత ఉంటాయి ఆమె దగ్గర. కిడాంబిగారి ఇంట్లో అన్నిటిమీదా అభిలాష పెంచే వాతావరణం ఉంది. మూడు రోజులు గడిచాయి.. జరగవలసిన పనులకి రూపకల్పన అయింది. ఆ ఊళ్ళో Fraklin Township Board of Education Secretary ని కలవడం మంచి ఫలితాన్నిచ్చింది. న్యూయార్కు, న్యూజెర్సీల మధ్య తిరిగాం.

సంభాషణల్లో చాలా దూరం వచ్చాం. ఈ మూడు రోజుల్లో కలిసిన తెలుగు మిత్రులందరూ పేరుపేరునా మాటల్లో మాతో తిరిగేరు. పనుల్లోనూ! హైవేలమీదా, ఫ్రీవేల మీదా మాటలు. వేగ నియంత్రణల గురించి చర్చ. శుల్కాల గురించి వాదన. Stevens Instittute of Tecnhology లో కాస్సేపు, East River ఒడ్డున మరికొంతసేపు కాలం గడిచింది. న్యూయార్కు చిరునామా World Trade Center భవనాలని చూసి అబ్బురపడి పోయాం. ఆరుమైళ్ళ పొడువున విస్తరించి ఉన్న ఆకాశ హర్మ్యాలకి అవాక్కు సమాధానం అయింది. అన్నిటినీ గోపీగారి కళ్ళలోంచి చూస్తున్నాను. Stony Brook University లో Center for Telugu Studies శాఖాధిపతి డా. శ్రీధర్ గారితో సమావేశం. నిశితంగా విన్నారు. ప్రతిపాదనలెన్నో వచ్చాయి. పట్టుదలకి హర్షించారాయన. మళ్ళీ మర్నాడే కలవడానికి ప్లాను వేసుకొని బయటకు వచ్చాం. కారు వదిలి తూర్పునదికిందున్న ౨౮ మైళ్ళ సొరంగాల మార్గం పట్టాం. పైకి వచ్చేసరికి ఈ నగరానికి చిరునామా! మబ్బుల్ని కౌగిలించుకున్నట్లు కనిపించే ఆకాశ హర్మ్యాలు. అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు జరిగే Wall Street, Stock Exchange భవనాలు చూడ్డం పూర్తయింది. Saks V Avenue అతి ఖరీదైన షాపింగ్ కాంప్లెక్స్. మానవ స్వభావంలో ఒక విడ్డూరాన్ని చెప్తుంది. ఇది అగ్రరాజ్యం. కిడాంబితో గోపిగారితో ఈ ప్రయాణం అమెరికాకి వేరే అర్థం చెప్తోంది.

St. Peter's Catherdral నిర్మాణం అద్భుతంగా ఉంది. అక్కడినుంచి తెచ్చుకున్న Rosery ప్రాణ భద్రతతో దాచుకున్నాను. ఇది పదహారవది. ప్రపంచంలో నే తిరిగిన క్రైస్తవ దేవాలయాల్లో, నాకన్నీ రుద్రాక్ష మాలలే! అమెరికన్ల గర్వ కారణం, ప్రతిష్టకి నమూనా నూట పది అంతస్థుల World Trade Center దగ్గరికి వచ్చాం. కాళ్ళు పీకే దాకా తిరిగాం. విశ్వస్థాయి కంపెనీలని చూస్తుంటే చాలా విషయాలు జ్ఞానాన్ని పెంచాయి. ఎంతోమంది తెలుగు వాళ్ళు. మన దేశీయుల్ని చూస్తే అహమేదో పొంగింది. మా ముగ్గిరి మధ్య ఉద్వేగం, ఉత్తేజం. అంతర్జాతీయ సమితి ఆవరణలో వివిధ దేశాల జెండాల రెపరెపలు స్ఫూర్తి నిచ్చాయి. రాక్ ఫెల్లర్ బిల్డింగు దగ్గర వారి ఉపకార వేతనాల సహకారం గురించి చాలా విశేషాలు చెప్పారు కిడాంబి. మాటలకలసట లేదు. మూలమూలా తిరిగాం. వీధి మారినప్పుడల్లా ఆ-లోచనలతోపాటు సంభాషణ కూడా తెలుగులోకి మళ్ళేది. Edison Township స్కూళ్ళలో గుజరాతీ భాష

చేరింది. మన తెలుగు కూడా అమెరికా విద్యా వ్యవస్థలో స్థానం పొందకపోతే ఉనికి గల్లంతౌతుందనే భయం. నిర్ధారణకొచ్చాం. ఇదే జరిగితే తెలుగు పేగు సంబంధానికి దెబ్బ. నిష్కామంగా పని చెయ్యాలని మనస్సుల్లో ఒట్టేసుకున్నాం ముగ్గురం. జన్మ రహస్య కారణమేదో బయటపడ్డభావన!! మళ్ళీ తూర్పునది ఒడ్డుకొచ్చాం. సాయంకాలమైంది. ఓపిక తగ్గింది. అదృష్టవశాత్తు మిగిలిన అతి ముఖ్యమైన మీటింగులు వాయిదా పడ్డట్టు ఫోను వార్త! మళ్ళీ World Trade Center కి వచ్చి మేయరు చివుకుల ఉపేంద్రగారిని, డా. గుజువర్తి కృష్ణారెడ్డి గారినీ మర్నాడు కలవాలని! రాత్రంతా తెలుగు చర్చలు, భవిష్యత్తుకి ఏర్పాట్లు, జీవితాన్ని అరగదీసేస్తూ తాపత్రయం. సినారే గారితో, నాన్నగారితో, వాషింగ్టన్ విదేశాంగ శాఖలో ఉన్న మా అమ్మాయి సీతతో మాటాలారాత్రి.

తెల్లారింది. ౨౦౦౧ సెప్టెంబరు ౧౧. మామూలుగా కేలండరులో ఒక తారీఖు. ప్రయాణం మొదలయింది. కిడాంబిగారూ, నేనూ గతరాత్రి కామాతో ముగిసిన సంభాషణను కొనసాగిస్తూ పనిచేస్తున్నాం. టీ.వి రోజులాగానే మోగుతోంది. World Trade Center కి బయలుదేరిన ముగ్గురికీ ప్రభగారి కేక ఊపిరాపేసింది. వంద అంతస్థుల భవనం నిప్పంటుకొని మండిపోతోంది. గుండె కొండైపోయింది. దిగ్భ్రమ! ఏక్సిడెంటేమోనన్న ఊహ వచ్చింది. నిన్న సాయంత్రం ఆరుగంటల సేపు అక్కడే తిరిగాం. ప్రపంచ వాణిజ్యకేంద్రం, అమెరికా అగ్రరాజ్య ప్రతిష్టాత్మక భవనం తగలడ్డమేమిటీ! CNN వార్తలు సరైన సమాధానం ఇవ్వటంలేదు. కొయ్యల్లా చూస్తూ నిలబడిపోయాం. ప్రత్యక్ష ప్రసారం మొదలైంది. ఇంతలోనే ఓ విమానం పదునైన బాకులా దూసుకు వచ్చేస్తోంది. World Trade Center రెండవ భవంతి వైపు.... కాదు.... లోకి!! "ఏమిటీ! వాడికి కళ్ళుకనపడవా! అలా వచ్చేస్తుందేమిటి?" అనుకునేలోగా ఆ అమెరికన్ ఎయిర్ లైన్స్ విమానం ట్రేడ్ బిల్డింగులోకి దూసుకుపోయింది. మంటలు ఆకాశంలోకీ! ఈ పని మానవసాధ్యం కాదే! కళ్ళముందే జరిగిపోతోంది. న్యూసు రీడరు నిశ్చేష్టత వణుకు పుట్టిస్తోంది. Anti life గురించి live news ! దీనికి ఏ భాషలోనైనా పేరుందా? ఈ దిగ్భ్రమలోంచి బయటపడక ముందే మరో వార్త.

మరో విమానం వాషింగ్టన్ నగరంలో పెంటగాన్ ని ఢీకొంది. మానవ మేధ గడ్డకట్టుకుపోయిందా క్షణంలో. ఏం జరుగుతోంది? నాకు స్పృహపోతోంది. నా ప్రాణాలూ, గుండె అన్నీ కెవ్వుమంటున్నాయి. సీత అక్కడే ఉంది. టీ.వీ చూస్తే ఏం కనిపిస్తుందేమోనన్న భయం. తెరలు తెరలుగా ఏడుపొస్తోంది. అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్యనుండే పెంటగాన్ మీద దాడి ఏమిటీ! ఈ దాడిని ప్రపంచం ప్రేక్షకకళ్ళు పెట్టుకొని చూస్తోంది. ఆ విమానాలు న్యూయార్కు నుంచి హైజాక్ అయినట్లు వార్త. బ్రహ్మాండమైన భూకంపంలా! సముద్రపు పొంగులాంటి లావాలా! కొండల గుట్టల బూడిద వర్షంలా! మంటలూ! పొగలూ! కేకలూ! మృత్యువు స్వైర విహారం చేస్తోంది.

కిడాంబి ఫోను వదలలేదు. లైను అందడంలేదు. సాయంత్రమైంది. అవి తగలడుతూనే ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రాణాలు మాడిమసి అయినట్లు దారుణ వార్తలు అందుతున్నాయి. మృత్యువు పంట పండుతోంది. ఇంత దు:ఖాన్ని, భయాన్ని మోపగల శక్తిలేదు. ఓపూట ప్రయత్నం తర్వాత ఉపశమనం సీత క్షేమంగా ఉన్న వార్త అందడం, House of Congress నుంచి వచ్చిన ఫోనులో సీత కంఠం ఒకే క్షణం విన్నాక, వివరాలు చెప్పకూడని పరిస్థితి తనది. కిడాంబి ఇంట్లో వాతావరణం గడ్డ కట్టుకుపోయింది. వెన్నులో చలి! పక్కలో పోటు. అందరిదీ అదే స్థితి! ఉగ్రవాదుల చర్యలకి అమెరికా తల్లడిల్లిపోయింది. మానవ విషాదం దిగంతాలు దాటుతున్న వేళ. అమెరికా రాజ్యాంగం, యంత్రాంగం, అధికారం అంతా నివ్వెరలో! కిడాంబి సంయమనం, ప్రేమ, సహన స్వభావం కొండంత అండయింది అక్కడున్న మాఅందరి ఆరాటాన్ని గట్టేక్కిస్తూ. అలజడిలో అసలు మనిషి బయటపడతాడు. కిడాంబిలో "అసలు మనిషి" ౯/౧౧ నాడు విశ్వరూప దర్శనం ఇచ్చాడు.

అమెరికా విమానాశ్రయాలన్నీ మూత పడ్డాయి. అమెరికా అధికారం గర్వం, ధనదర్పం నాగరికత భోరున ఏడుస్తున్నాయన్న గోపీ మాటల్ని అమెరికా క్రమశిక్షణ, అపురూపమైన ప్రజాస్వామ్య భావన, సంయమనం, సహాయక చర్యలూ, అగ్నిమాపక బృందం వాళ్ళ త్యాగనిరతీ, తమ బ్రతుకులని పణం పెట్టి సాయం చెయ్యాలని నిప్పుల్లోనికి దూసుకుపోయి మాడిమసై పోయిన వాళ్ళ జీవ సంస్కారం వమ్ము చేస్తున్నాయి. మంటల మృత్యువులోంచి మృత్యువులోకి నేల దూకి వేలమంది బూడిదైపోయారు. అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్‌నీ కుటుంబాన్నీ రహస్య స్థావరం చేర్చడం, విమానాశ్రయాలన్నిటినీ మూసేయడం ఒకేసారి

జరిగింది. దేశం మొత్తం తల్లడిల్లిపోతోంది. ప్రపంచం నివ్వెరలో! కిడాంబి ఉన్నట్టుండి అంతకు ముందు రోజు జరిగిన సంఘటన గుర్తుచేశారు. ముగ్గురం కారు తూర్పు నది దగ్గర వదలి టాక్సీ ఎక్కాం. నేనూ గోపీగారూ డ్రైవరు మనవాడే అనుకున్నాం. కిడాంబి "కాదండీ! వీడు సర్దారు కాదు, హిందువు కాదు, తురకవాడై ఉంటాడు. ఎందుకైనా మంచిది. తెలుగిలాంటి చోట్ల రక్షిస్తుంది" అనడం విని డ్రైవరు "మీరు ఇండియన్‌లా" అంటూ మాటలు మొదలు పెట్టాడు. అతని మొహం బిగుసుకుపోయింది. కంఠంలో కటువు. "అమెరికావాళ్ళు తొందరలోనే నాశనమై పోతారు. వీళ్ళకి గర్వం, శిక్షపడవలసినదే! త్వరలోనే వీళ్ళకి అంతం". నాకూ కిడాంబికి పట్టరాని ఉద్రేకం. అతను అమెరికాని తిడుతూనే ఉన్నాడు చివరిదాకా. మర్నాడే ఈ ఉగ్రవాద విధ్వంసక చర్య! "ఇది కాకతాళీయమని అనుకోలేకపోతున్నా శారదా" కిడాంబి మాటలు ఇంకా చెవుల్లో గింగుర్లు! ఇంతలో ఫోను! కిడాంబి ఒక్క ఉదుటున పరుగులు. అరగంటలో తిరిగి రాక నాలుగేళ్ళ పసివాడిని నడిపించి లోపలికి తెస్తూ, ఆ చిన్నవాడి అమ్మ దీపిక వరల్డ్ ట్రేడ్ సెంటరు ౨౭ వ అంతస్థులో కొద్ది రోజుల క్రితం ఉద్యోగానికి చేరింది. నాన్న కుమార్ డిపెండెంట్ వీసా, ఉద్యోగాన్వేషణ! ఇంకా పెట్టెలు తెరవలేదు పూర్తిగా. మూడు వీధులవతల ఎపార్ట్‌మెంటులో దిగారు. హైద్రాబాద్ నుంచి పరిచయం. త్యాగశీలి కిడాంబి! వణికిపోతున్నా కళ్ళలో ఎంత నిశ్చలత! జీవచ్ఛవంగా ఉన్న కుమార్‌తో భుజంమీద చెయ్యివేసి ఇంట్లోకీ వీధిలోకీ! వందల మందితో మాటలు, కరిగి నీరై పోతున్నారాయన నిస్సహాయతతో! విమానం ౮౬వ అంతస్థులోకి దూసుకు పోవడం, బూడిద కుప్ప అయి నేల కూలడం మేమంతా చూశాం. కొత్త ఇల్లాలు, తల్లి, కుమార్ భార్య ఆశల దీపిక ఆ బూడిదలో భాగమైంది. నిశ్చలంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉన్నారు కిడాంబి చివరిదాకా! నిస్తేజం తీరేనా! చీకటి తెల్లారేనా! వారం గడిచింది. అందరి మనసులు చింతామగ్నం. దు:ఖమయం. ఒకటే భీతి. కిడాంబి ఏ పనీ ఆపలేదు. ఏదైవ దివ్యశక్తో నడిపించింది. తెలుగు యూనివర్సిటీ పనులన్నీ పూర్తి చేశారు. శత విధాల ప్రయత్నాల తర్వాత బరువెక్కిన మనసులతో చికాగో చేరాం. కుటుంబానికంతటికీ దూరంగా ఉండి దిగాలు పడిన మావారు శ్రీరాం స్థితి చూసి గోపీ తల్లడిల్లిపోయారు.. ప్రపంచ చరిత్రని మార్చివేసిందీ సంఘటన. మానవ స్వభావానికి కొత్త నిర్వచనం తయారు చేసుకోవాలి. కిడాంబి పరిచయం పురాజన్మ సుకృతం. ఈయన జీవితమంతా పఠించ వలసిన మహాగ్రంథం. విశ్వశాంతికి తానొక సమిధైన కిడాంబికి ఏ పురస్కారమిద్దాం? తలపుల హారతి తప్ప!!.

Best Wishes From

DUNKIN' DONUTS

2500 Nazareth Road, Easton, Pa

3711 Nazareth Easton Pike, Nazareth, Pa

3606 Nazareth Pike, Bethlehem Pa

1312, US Hwy 22 East Phillipsburg, NJ